క్లుప్తంగా

వైభవంగా ఇరుముడి ధారణ



ఇరుముడులు ధరించి శబరిమలకు పయనమవుతున్న మాలధారులు

భీమడోలు : భీమడోలులో ప్రసిద్ధి గాంచిన శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో సోమవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడుల ధారణ మహోత్సవ వేడుక వైభవంగా నిర్వహించారు. విశేష పూజలు నిర్వహించిన మాలధారులు ఇరుముడులను ధరించి జ్యోతి దర్శనానికి శబరిమల తరలి వెళ్లారు. కుటుంబ సమ్మేతంగా తరలి వచ్చిన స్వాములతో ఆ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు బృందావనం మధు పవన్ నేతృత్వంలో గణపతి పూజ అనంతరం ఇరుముడుల పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురుస్వామి అల్లూరి రాఘవేంద్ర రావు, 18 పడులు పూర్తి చేసుకున్న సోమరాజు, ప్రసాదరావు, అర్చకులు బృందావన మధు పవన్‌లను దుశ్శాలువాలతో ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఘనంగా సత్కరించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఆలయంలోని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

హమాలీల నిరసన



పాతూరులో గోడౌన్ వద్ద నిరసన తెలుపుతున్న హమాలీలు

భీమడోలు : పెరిగిన కూలి రేట్లును అమలు చేయాలని, తక్షణమే జీవోను విడుదల చేయాలని, యూనిఫారమ్ ఇవ్వాలని, కొత్త వారికి పీఎఫ్ అమలు చేయాలని కోరుతూ సోమవారం సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు సివిల్ సప్లయిస్ గోడౌన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జట్టు మేస్త్రీ మత్తే ప్రసాద్‌తో పాటు కార్మికులు పాల్గొని తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు గడ్డి సూర్యారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పెద్దల సహకారం అభినందనీయం

నిడమర్రు : గ్రామం అభివృద్ధిలో గుణపర్రు గ్రామ పెద్దల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గుణపర్రు నుంచి గ్రామ శ్మశాన వాటికకు వెళ్లేందుకు అవసరమైన కాలినడక బెయిలీ బ్రిడ్జ్‌ను గ్రామ పెద్దల ఆర్థిక సహకారం రూ.12 లక్షలతో నిర్మించారు. సోమవారం ఈ వంతెనను ఎమ్మెల్యే ప్రారంభించారు. బ్రిడ్జ్ నిర్మాణంకు సగం వాటగా రూ.6 లక్షలు సొంత నిధులు ఇచ్చిన సర్పంచ్ కూనపురాజు సత్యనారాయణ రాజును, మరో రూ.6లక్షలు సమకూర్చిన గ్రామస్తులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. సర్పంచ్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ గుణపర్రు గ్రామం ఏర్పడిన నాటి నుంచి ఎవరైనా చనిపోతే వారి దహన సంస్కారాల కోసం 4 కిలోమీటర్లు పందికోడు చుట్టూ తిరిగి వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడేవాళ్లమన్నారు. పందికోడుపై కర్రల వంతెన నిర్మించినా వర్షాకాలంలో కొట్టుకుపోయేదన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కొరకు పెద్దలు సహకారంతో ఈ వంతెన నిర్మాణం పూర్తి చేశామన్నారు. పొలాలు, ఆక్వా చెరువులు రైతులు సైతం పందికోడుకు అవలి పక్క ఉండటంతో వారి సమస్య పరిష్కారం అయిందన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

ముందుగా రూ.10 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించిన మైక్రోవాటర్ ఫిల్టర్‌ను ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభించారు. రూ.5లక్షల అంచనా వ్యయంతో నిర్మించే పక్కా మురుగునీటి కాలువ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్, మాజీ సర్పంచ్ గాదిరాజు సుదర్శనవర్మ, గ్రామపార్టీ అధ్యక్షులు గాది నాగేశ్వరరావు తదితరులున్నారు.

బలరామావతార అలంకరణలో జనార్దన స్వామి



జనార్దన స్వామి

ఏలూరు (ఆర్ఆర్ పేట): స్థానిక అగ్రహారం భూ, నీళా సమేత జనార్దన స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, తిరుప్పావై సేవా కాలం నిర్వహించి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. రాత్రి స్వామివారికి బలరామావతార అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పాదయాత్రతో ప్రజారంజక పాలన

- ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- ఘనంగా ప్రజాసంకల్ప యాత్ర వేడుకలు



గణపవరం వైఎస్సార్ కాలనీలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు



బువ్వనపల్లి కూడలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న పార్టీ శ్రేణులు

గణపవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘకాలం పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం వల్లనే ఇప్పుడు ప్రజారంజక పాలన చేస్తున్నారని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. వైఎస్ జగన్ ప్రజాసంకల్ప పాదయాత్ర నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం గణపవరంలోని వైఎస్సార్ కాలనీలో పార్టీ నేతల సమక్షంలో కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర చేసి ప్రజారంజక పరిపాలన చేసినట్లుగానే ఆయన తనయుడు వైఎస్ జగన్ పాదయాత్రచేసి తెలుసుకున్న ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తున్నారని అన్నారు. నవరత్నాల పథకాలను ప్రజలందరికీ నేరుగా అందచేసి చరిత్ర సృష్టించారన్నారు. ఏపథకమైనా ప్రజల సంక్షేమమే పరమావధిగా అమలు చేస్తున్నామన్నారు. రానున్న కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గణపవరం, నిడమర్రు మండలాల పార్టీ కన్వీనర్‌లు దండు రాము, సంకు సత్యకుమార్, సర్పంచ్ మూర అలంకారం, పార్టీ నాయకులు కాకర్ల శ్రీను, నడింపల్లి సోమరాజు, తోట శ్రీను, రొంగల శ్రీను, కొండేటి వెంకటరత్నం, నన్నేటి మోహన్,శెట్టి రాజా, లచ్చిరెడ్డి నాని, మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ కె.జగపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రులో...

నిడమర్రు: ప్రజా సంకల్పయాత్రతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలు తెలుసుకున్నారని, అందుకే ముఖ్యమంత్రిగా అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల బాధ్యులు పుప్పాల కన్నబాబు అన్నారు. ప్రజా సంకల్పయాత్రకు సోమవారంతో 4 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్, గ్రామపార్టీ అధ్యక్షులు సంకు శ్రీనువాసరావు, సంకు చంటి, సత్తి సత్యనారాయణరెడ్డి, సంకు శ్రీను, ఐతం తాతయ్య, అల్లుమోలు సత్తిబాబు, అల్లుమోలు యోసు, గోకా సూరిబాబు, యర్రా ఆదినారాయణ, గొట్టుముక్కల విశ్వనాధరాజు తదితరులున్నారు.

10 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి

ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో పదివేల ఎకరాలలో వరినాట్లు పూర్తయ్యాయని ఏవో బాలిన వేంకటేష్ తెలిపారు. రబీలో నాట్లు వేసే పనుల్లో రైతులు, కౌలు రైతులు నిమగ్నమయ్యారు. 1121 అమ్మోరు అనే రకాన్ని ఎక్కువ మంది రైతులు నాట్లు వేస్తున్నారు. కాగా 1,365 ఎకరాలలో మొక్క జొన్న ప్లాంటేషన్ వేసినట్లు ఏవో చెప్పారు. పొగాకు 750 ఎకరాలలో వేశారన్నారు.

సంక్రాంతి సంబరాలు

దెందులూరు : కొవ్వలిలోని ఉన్నత పాఠశాలలో ఏలూరు జిల్లా జీవవైవిధ్య యాజమాన్యం కమిటీ, స్వచ్ఛంద సేవా సంస్థ గ్రామదీప్ ఆధ్వర్యంలో ఈ నెల 13న మధ్యాహ్నం 2 గంటలకు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు వెలమాటి మనోహరి తెలిపారు. రంగవల్లుల పోటీలు నిర్వహిస్తామన్నారు. 14న శనివారం ఉదయం 5.30 గంటలకు భోగి మంట వేసి సంప్రదాయ పోటీలు నిర్వహిస్తామన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే సచివాలయ వ్యవస్థ

- ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- గుణపర్రులో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం



తోకపల్లిలో సంక్షేమ పథకాల లబ్ధి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు : ప్రజల సమస్యలు, ఫిర్యాదులు స్థానికంగానే సత్వరం పరిష్కరించేందుకే గ్రామ సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం మందలపర్రు గ్రామ సచివాలయం పరిధిలోని గుణపర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ప్రజల వద్దకే పరిపాలన అనే లక్ష్యంతో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను అందుబాటులో ఉంచేందుకే గ్రామ సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే గతంలో సుదూర ప్రాంతాల్లో ఉన్న జిల్లాకేంద్రాలకు, మండల కేంద్రాలకు వెళ్లాల్సిన భారం తగ్గిందన్నారు. గ్రామ సచివాలయం సిబ్బందికి అందుతున్న ఫిర్యాదులు, ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించేలా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సూచించారు. నవరత్నాలతో ప్రతి కుటుంబం ప్రభుత్వ పరంగా ఏదో ఒక ఆర్థిక భరోసా పొందిందన్నారు. ఆ వివరాలు ప్రజలకు, లబ్ధిదారులకు తెలియపరిచేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి అధికారిని, ప్రజాప్రతినిధులను ప్రతి ఇంటికి పంపించి పథకాల అమలుపై సమస్యలు తెలుసుకోమని మీ వద్దకు పంపించారని లబ్ధిదారులతో వాసుబాబు అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ కోడే కాశి, పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, మాజీ ససర్పంచ్ గాదిరాజు సుదర్శనవర్మ, సర్పంచ్‌లు కూనపురాజు సత్యనారాయణరాజు, దెందుకూరి సూర్యకాంతమ్మ , పుప్పాల మెహర్‌కుమార్, పాట్నూరి ఉమా మహేశ్వరరావు, ముగ్గళ్ల యాకోబు, దూసనపూడి సత్యనారాయణ, దాసే ఝాన్సీ, ఎంపీటీసీ ముదునూరి త్రివేణి తదితరులున్నారు.

పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ



ఎమ్మెల్యే కొఠారుకు హారతిపడుతున్న మహిళలు

ఏలూరు రూరల్: దెండులూరు నియోజకవర్గంలో పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం ఏలూరు మండలం మాదేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన జగనన్నకాలనీ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం కావాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుడికీ రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుందని తెలిపారు. దీనికి తోడు డ్వాక్రా సంఘాల నుంచి రూ.35 వేలు చొప్పున అందిస్తున్నామని, సుమారు రూ.3 వేలు ఖర్చు కాగల విద్యుత్ కనెక్షన్ ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు. నిర్మాణానికి ఇసుక, సిమెంట్, ఐరన్ అందుబాటులో ఉంచామన్నారు. కాలనీల్లో బోర్లు వేసి నీటి వసతి కల్పించడంతోపాటు రోడ్లు అభివృద్ధి చేశామని వివరించారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేకు పలువురు లబ్ధిదారులు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులతో కలిసి కమ్యూనిటీహాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సొంతంగా ఇల్లు నిర్మించుకోలేని పేదలకు కాంట్రాక్టర్లతో మాట్లాడి నిర్మాణ పనులు చేపట్టేలా చూడాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, సర్పంచ్ కొరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ, ఉపసర్పంచ్ నరహరిశెట్టి రాధాకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్, పల్లెం ప్రసాద్, మండల కొండలరావు, జాలిపూడి రైతు సంఘం చైర్మన్ బొల్లిముంత రామ్మోహనరావు, వార్డు సభ్యుడు పంపుల శ్రీను పాల్గొన్నారు.

ఉపాధి నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి

దెందులూరు: జోగన్నపాలెంలో నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయల జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అయ్యాయి. ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ సహకారం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో అర్హులకు అందాల్సిన సొమ్ము పక్కదారి పట్టిందని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, వైఎస్సార్ సీపీ మండల నేత నిట్టా గంగరాజు అన్నారు. సోమవారం జోగన్నపాలెంలో వారు మాట్లాడుతూ కలెక్టర్ జోక్యం చేసుకుని వెంటనే ఉన్నత స్థాయి విచారణ చేయించి, నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు చేరిన లక్షలాది రూపాయలను వెంటనే వారి వద్ద నుంచి రికవరీ చేయించి సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జోగన్నపాలెంలో ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, పనికి వెళ్లని ధనవంతులకు 40 మందికి నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి ఉద్యోగుల సహకారంతో నిధులను దారి మళ్లించారన్నారు. గంగన్నగూడెం, ఏలూరు, పెదవేగి గ్రామస్తులకు జోగన్నపాలెంలో జాబ్‌కార్డులు ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా అధికారులు, కలెక్టర్, ఉపాధి పీడీ సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టాలని జెడ్పీటీసీ కోరారు. జోగన్నపాలెంలో నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు ఉపాధి నిధులు జమ చేయడం వాస్తవమేనని జాతీయ ఉపాధి హామీ పథకం దెందులూరు మండల ఏపీఓ దశరథ రాంజీ సోమవారం వివరణ ఇచ్చారు. దీనిపై ఇప్పటికే జోగన్నపాలెం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి స్వచ్ఛందంగా ఉద్యోగానికి రాజీనామా చేశారన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేస్తామన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



చేబ్రోలు పోలీసుస్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న కోడికత్తులు, అదుపులో నిందితుడు



బాదంపూడిలో బరిని ధ్వంసం చేస్తున్న దృశ్యం

గణపవరం : సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, జూదాలకు ఎలాంటి అనుమతులూ లేవని, సర్కిల్ పరిధిలోని మూడు మండలాలలో ఎవరైనా ఈ చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని గణపవరం సీఐ ఎంవీ సుభాష్ హెచ్చరించారు. సోమవారం గణపవరం పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. జూదాలు అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. కోడిపందేలు, పేకాటలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. వీఆర్వోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా బరులు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేయడంతోపాటు బరులు ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే కోడికత్తులు తయారీదార్లను అదుపులోకి తీసుకుని, కోడికత్తులు స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోడికత్తులు స్వాధీనం

ఉంగుటూరు : కోడిపందేలకు కత్తులు సిద్ధం చేసిన ఘంటసాల ఏసుబాబును చేబ్రోలు ఎస్సై స్వామి అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. మండలంలోని వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన ఇతని వద్ద 34 కోడి కత్తులను, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బాదంపూడిలో పందెం బరి ధ్వంసం

ఉంగుటూరు : బాదంపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన కోడిపందేలు బరులను తహసీల్దార్ వెంకట రమణ, ఎస్సై స్వామి,, గ్రామస్థాయి కార్యదర్శులతో కలిసి వెళ్లి వాటిని ధ్వంసం చేశారు. బరులు చుట్టూ నెలకొల్పిన సిమెంట్ స్తంభాలను కూలదోశారు. కోడిపందేలు, జూదం ఆడటం నేరం అని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. రెవెన్యూ కార్యదర్శి,, మహిళా పోలీసులు పాల్గొన్నారు. ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, డీఎస్పీ పైడేశ్వర రావు, సీఐ సుభాష్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఎస్సై స్వామి

సంక్రాంతి ముసుగులో జూదక్రీడలు నిర్వహిస్తే చర్యలు

భీమడోలు : సంక్రాంతి ముసుగులో జూద క్రీడలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ అన్నారు. గుండుగొలను గ్రామ సచివాలయం వద్ద సోమవారం రాత్రి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతికి జూదం వద్దు.. సాంప్రదాయమే ముద్దు అనే నినాదంతో గ్రామ సచివాలయ సంరక్షణ కార్యదర్శులు, గ్రామస్తులు, యువకులతో సమావేశాన్ని నిర్వహించారు. సర్పంచ్ కుర్మా లక్ష్మీరాజ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై మాట్లాడుతూ సంక్రాంతి సాకుతో జూద క్రీడలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోడిపందేల బరులను నిర్వహించే నిర్వాహకులు, బరుల స్థలాల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటి వరకు 46 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, ఏఎస్సై చలపతిరావు, సచివాలయ కార్యదర్శి మురళీ, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోడిపందేలను అడ్డుకుంటాం

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ సందర్భంగా అన్ని గ్రామాల్లో కోడిపందేలు, పేకాటలను అరికట్టేందుకు ప్రజలు, అధికారులు పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించాలని దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల వీఆర్‌ఓలు, వీఆర్ఏలకు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాంచారయ్య, సీనియర్ అసిస్టెంట్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఏ గ్రామంలోనైనా పేకాట, కోడిపందేలు, గుండాట ఆడినా, ఏర్పాట్ల సమాచారం తెలిసిన వెంటనే మండలాధికారులకు, పోలీసులకు తెలియజేయాలన్నారు.

జూదరుల అరెస్టు

పెదపాడు: పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పెదపాడు పోలీసులు సోమవారం తెలిపారు. పోలీసు స్టేషన్ పరిధిలోని కొక్కిరపాడులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పెదపాడు ఎస్సై బీ నాగబాబు తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసారు. నిందితుల నుంచి రూ.5,200 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై తెలిపారు.

'ఆత్మ దర్పణం' స్వీయ రచన ఆవిష్కరణ



ఆత్మదర్పణం పుస్తకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

ఉంగుటూరు : ఆధ్యాత్మిక ప్రవచన కర్త జటావల్లభుల జగన్నాథం జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తొంబై ఆరేళ్ల వయస్సులోను తరగని ఉత్సాహంతో తనదైన శైలిలో ప్రవచనాలు కొనసాగిస్తూ స్వీయ చరితమును రచించిన జగన్నాథం సేవలను పలువురు వక్తలు కొనియాడారు. సాయియువసేన ఆధ్వర్యంలో సోమవారం ఆత్మదర్పణము స్వీయ రచన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాకినాడకు చెందిన గిడుగు వెంకట చలపతిరావు, దంపతులను సాయి యువసేన నిర్వాహకులు సత్కరించారు. జగన్నాథం మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తేనే ఉన్నత స్థాయికి ఎదగగలడని అన్నారు. తన స్వీయ చరితములో సమాజ హితమే ప్రధాన ధ్యేయంగా అనేక అంశాలు ప్రస్తావించానన్నారు. కార్యక్రమంలో సాయి యువసేన అధ్యక్షుడు జగదీష్ కుమార్, ఉపాధ్యక్షుడు జగన్నాయకులు, సలహాదారు డా.సాయిరాం, రామమూర్తి భీమేశ్వరప్రసాదు, కృష్ణ సోమయాజులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన కల్పించాలి



వినియోగదారుల కమిషన్ జిల్లా అధ్యక్షుడిని కలిసిన విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): వినియోగదారుల చట్టం పట్ల విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు డి.కోదండరామమూర్తి న్యాయ విద్యార్థులు సూచించారు. క్లినికల్ లీగల్ శిక్షణ నేపథ్యంలో భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో రెండో సంవత్సరం ఎల్ఎల్‌బీ విద్యార్థులు ఏలూరులోని కుటుంబ న్యాయస్థానం, జిల్లా వినియోగదారుల కమిషన్‌లను సోమవారం సందర్శించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు డి.కోదండరామమూర్తికి నమూనా దరఖాస్తు ఫారంలను అందజేశారు. ఈ సందర్భంగా కోదండరామమూర్తి మాట్లాడుతూ రైతుల సమస్యల పట్ల స్పందించి గ్రామీణులకు చట్టాల పట్ల అవగాహన కల్గించాలన్నారు. కొన్న ప్రతి వస్తువుకూ తప్పక రశీదు పొందాలని సూచించారు. వినియోగదారులకు ఎటువంటి నష్టం కలిగినా కమిషన్ ఆశ్రయించవచ్చునన్నారు. కమిషన్ సభ్యులు ఎస్ సురేష్ కుమార్, వి.శ్రీనాగలక్ష్మి, లా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు

ఉంగుటూరు: ముక్కోటి ఉత్సవాలలో భాగంగా ఆంజనేయస్వామి ఆలయాల వద్ద అన్న సంతర్పణలు నిర్వహించారు. గోపినాధపట్నం ఆంజనేయస్వామి ఆలయం వద్ద సీతారామస్వామి వారి మేలుకొలుపు సేవలు జరిపారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. దేవదాయ ధర్మాధాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి, ఏఎంసీ మాజీ డైరెక్టరు లక్ష్మణరావు పాల్గొన్నారు. నారాయణపురం కాలువ గట్టున ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద, జాతీయ రహదారి పక్కన ఉన్న దాసాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్న సమారాధన జరిపారు. నారాయణపురంలో జరిగిన అన్న సమారాధనలో ఎమ్మెల్యే సోదరడు చిన్నబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, ఎంపీటీసీ బండారు నాగరాజు, ఉపసర్పంచి అడపా శ్రీనివాస రావు పాల్గొన్నారు.

28 నుంచి అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు



గోపన్నపాలెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి

దెందులూరు: గోపన్నపాలెంలోని అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి 66వ వార్షికోత్సవాలను ఈ నెల 28 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 28న ఉదయం 9.31 గంటలకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఉత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, కోలాటం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఫిబ్రవరి 6న మహా అన్నసమారాధన నిర్వహిస్తామని సోమవారం దెందులూరు ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు వివరించారు.

యువత క్రమశిక్షణ అలవర్చుకోవాలి

దెందులూరు: యువత సత్ప్రవర్తన, క్రమశిక్షణ, స్వచ్ఛమైన జీవనవిధానాన్ని అలవర్చుకోవాలని డ్రగ్స్ సీఐ శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎం.రాధాకృష్ణ అధ్యక్షతన ఏట కరుణానిధి ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌కు యువత సహకారం పేరిట ర్యాలీ, అవగాహన సమావేశం నిర్వహించారు. తొలుత ర్యాలీని ప్రిన్సిపల్ ఎం.రాధాకృష్ణ, సీఐ శ్రీనివాసరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మందలపర్రులో గడప గడపకు మన ప్రభుత్వం

నిడమర్రు : మందలపర్రు గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరై గత మూడేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరిస్తారన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకూ అధికారులు హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరవ్వాలని కోరారు.

పారదర్శక పాలన అందిస్తున్న సీఎం జగన్



నాగులదేవునిపాడులో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, నాయకులు

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనతో ప్రజలందరి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. సోమవారం శ్రీరామవరంలో ప్రజాసంకల్ప పాదయాత్ర జరిగి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. గాలాయగూడెం పంచాయతీ నాగులదేవునిపాడులో సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, పార్టీ నాయకులు, వార్డు మెంబర్లు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.